జియోమార్ట్ ప్రచారకర్తగా మహీంద్రసింగ్ ధోనీ

ముంబై, అక్టోబర్ 6: రిలయన్స్ రిటైల్ సంస్థ జియోమార్ట్ బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రముఖ క్రికెటర్ మహీంద్ర సింగ్ ధోనీని నియమితుల య్యారు. మరోవైపు ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని సంస్థ జియోఉత్సవ్ పేరుతో ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ఈ నెల 8న ప్రారంభం కానున్న ఈ ఆఫర్ కింద 50 శాతం నుంచి 80 శాతం వరకు రాయితీ ఇస్తున్నట్టు తెలిపింది. ఎలక్ట్రానిక్స్ పరికరాలపై 70 శాతం రాయితీ ఇస్తున్న సంస్థ..స్మార్ట్‌ఫోన్లపై రూ.15 వేల వరకు ఎక్స్చేంజ్ ప్రయోజనాలు పొందవచ్చు నని తెలిపింది.

జియో, ఎయిర్‌టెల్ ప్రత్యేక ప్లాన్లు

మరోవైపు, క్రికెట్ ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకొని జియో, ఎయిర్‌టెల్‌లు ప్రత్యేక ప్లాన్లను అందుబాటులోకి తీసుకొచ్చాయి. డిస్నీ+హాట్‌స్టార్ కలుపుకొని పలు ప్రీపెయిడ్ ప్లాన్లను విడుదల చేసిన జియో..ఎయిర్‌టెల్ రెండు ప్లాన్లు ప్రవేశపెట్టింది. రూ.99కే రెండు రోజుల పాటు అన్‌లిమిటెడ్ డాటాతో పాటు రూ.49కే రోజుకు 6జీబీ డాటాను ఆఫర్ చేస్తున్నది. జియో మాత్రం నెల, త్రైమాసికపు, వార్షిక ప్లాన్లలో డాటా, అన్‌లిమిటెడ్ వాయిస్, డిస్నీ+ హాట్‌స్టార్ మొబైల్‌ను అందిస్తున్నది.

రిలయన్స్ రిటైల్‌లోకి 4966 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రిటైల్ వెంచర్స్ (ఆర్‌ఆర్‌వీఎల్) లోకి మరో భారీ పెట్టుబడి తరలివచ్చింది. తాజాగా అబుదాబి ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) రూ.4,966.80 కోట్లతో 0.59 శాతం వాటా కొనుగోలు చేసినట్టు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్‌ఐఎల్) శుక్రవారం స్టాక్ ఎక్స్చేంజీలకు తెలిపింది. రిలయన్స్ రిటైల్ విలువను రూ.8.381 లక్షల కోట్లు (100.83 బిలియన్ డాలర్లు)గా పరిగణించి ఈ పెట్టుబడి వచ్చినట్టు ఆర్‌ఐఎల్ వెల్లడించింది. దీంతో దేశంలో అత్యధిక విలువ కలిగిన నాలుగు కంపెనీల్లో ఒకటిగా ఆర్‌ఆర్‌వీఎల్ నిలిచిందని పేర్కొంది. రిలయన్స్ రిటైల్ దేశవ్యాప్తంగా 18,500 స్టోర్లు, డిజిటల్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా గ్రోసరీ, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ఫ్యాషన్, లైఫ్‌స్టైల్, ఫార్మా ఉత్పత్తులను విక్రయిస్తున్నది.

బే విండో మరో షోరూం

హైదరాబాద్, అక్టోబర్ 6: రాష్ట్రానికి ఫర్నీచర్ ఉత్పత్తుల విక్రయ సంస్థ బే విండో.. హైదరాబాద్ మరో గ్యాలరీని ప్రారంభించింది. 6 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ షోరూంలో అన్ని రకాల ఫర్నీచర్ ఉత్పత్తులను విక్రయించనున్నట్టు కంపెనీ ఫౌండర్ సిద్ధాంత్ ఆనంద్ తెలిపారు. వచ్చే మూడేండ్లకాలంలో 10 నగరాలకు తన వ్యాపారాన్ని విస్తరించాలనుకుంటున్నట్లు చెప్పారు. ఇప్పటికే సంస్థకు 30 వేల చ.అ. విస్తీర్ణంలో ఫ్లాగ్‌షిప్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది.

అధిక ధరలతో ముప్పే

మొదటిపేజీ తరువాయి...

నమోదు కావచ్చన్న ఆర్బీఐ.. జూలై, ఆగస్టులతో పోల్చితే సెప్టెంబర్ రిటైల్ ద్రవ్యోల్బణ గణాంకాలు తగ్గుముఖం పట్టవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. దిగొస్తున్న కూరగాయల ధరలతోపాటు తగ్గిన వంటగ్యాస్ ధరలతో ద్రవ్యోల్బణం శాంతించవచ్చనీ పేర్కొన్నది. అయినప్పటికీ ద్రవ్యోల్బణం లక్ష్యానికి దగ్గరగా ధరల్ని తెచ్చేందుకు బాండ్ల విక్రయం ద్వారా తమ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగిస్తామని ఆర్బీఐ సంకేతాలిచ్చింది.

వరుసగా నాల్గోసారి..

ఇక వరుసగా నాల్గోసారి కీలక వడ్డీరేట్ల జోలికి సెంట్రల్ బ్యాంక్ వెళ్లలేదు. రెపోరేటు, రివర్స్ రెపోరేటును యథాతథంగానే ఉంచాలని ఆరుగురు సభ్యులున్న మానిటరీ పాలసీ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించింది. దీంతో రెపోరేటు 6.5 శాతం వద్ద, రివర్స్ రెపోరేటు 3.35 శాతం వద్దే ఉన్నాయి. కరోనా దెబ్బకు కుదేలైన దేశ ఆర్థిక వ్యవస్థను ఉత్సాహపర్చేందుకు రెపోరేటును వరుసగా తగ్గిస్తూపోయిన ఆర్బీఐ.. విజృంభించిన ద్రవ్యోల్బణాన్ని అదుపులో పెట్టేందుకు మళ్లీ పెంచుతూ వచ్చింది. ఈ క్రమంలోనే గత ఏడాది మే నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకు రెపోరేటును ఆర్బీఐ ఏకంగా 250 బేసిస్ పాయింట్లు పెంచిన విషయం తెలిసిందే. దీంతో కరోనాకు ముందున్న స్థాయిని మించిపోయింది. అయితే ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) మొదలు రెపోరేటును స్థిరంగానే ఉంచుతూ వస్తోంది.

వృద్ధిరేటుపై..

ఈ 2023-24కుగాను దేశ జీడీపీ అంచనానూ ఈసారి ఆర్బీఐ మార్చలేదు. గత అంచనానే కొనసాగిస్తూ 6.5 శాతంగా ప్రకటించింది. అయితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం చోటుచేసుకున్నప్పటికీ భారత వృద్ధిరేటుపై విశ్వాసం కనబర్చిన ఆర్బీఐ.. ప్రపంచ వృద్ధికి నవ చోదక శక్తిగా భారత్ ఆవిర్భవిస్తుందన్న ఆశాభావాన్నీ వెలిబుచ్చింది. ఇక ఇప్పటికీ వృద్ధికి మద్దతిచ్చే ద్రవ్య విధానం, ద్రవ్యోల్బణం అదుపునకే పెద్దపీట వేస్తామని ఆర్బీఐ చెప్పింది. తదుపరి ద్రవ్యసమీక్ష డిసెంబర్ 6-8 తేదీల్లో ఉండనున్నది.

శుక్రవారం ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో ద్రవ్య సమీక్ష సందర్భంగా డిప్యూటీ గవర్నర్లతో ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

- **పేమెంట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్ (పీఐడీఎఫ్) పథకం కిందికి పీఎం విశ్వకర్మ పథకం కాలపరిమితి మరో రెండేండ్లు పెంపు.**
- **కరోనా ఆంక్షలతో షాపింగ్, ఇతరత్రా ఖర్చులను తగ్గించుకున్న ప్రజలు.. మళ్లీ ఖర్చులకు వెళ్తుండటంతో గృహస్తుల పొదుపు రేటు గత ఆర్థిక సంవత్సరం (2022-23)లో ఐదు దశాబ్దాల కనిష్ఠానికి పడిపోయింది.**
- **ద్రవ్య లభ్యత నిర్వహణకుగాను ప్రభుత్వ సెక్యూరిటీల అమ్మకానికి ఓపెన్ మార్కెట్ కార్యకలాపాలను వినియోగించుకునే వీలున్నది.**
- **ద్రవ్య నిర్వహణ చర్యల్లో భాగంగా శనివారం ఇంక్రిమెంటల్ క్యాష్ రిజర్వ్ రేషియో (ఐ-సీఆర్ఆర్)ను పూర్తిగా ఉపసంహరిస్తున్న ఆర్బీఐ. మార్కెట్‌లోకి సదరు నిధుల విడుదల.**

రేపట్నుంచి ఆర్బీఐ ఆఫీసుల్లో 2వేల నోట్లు ఇవ్వొచ్చు: దాస్

ఈ నెల 8 (ఆదివారం) నుంచి ఆర్బీఐ కార్యాలయాల్లో రూ.2వేల నోట్లను మార్చుకోవచ్చని ఆర్బీఐ గవర్నర్ దాస్ తెలిపారు. శనివారంతో రూ.2వేల నోట్ల మార్పిడికి ఆర్బీఐ ఇచ్చిన వారం రోజుల గడువు పొడిగింపు ముగుస్తున్నది. దీంతో ఇంకా రూ.2వేల నోట్లను మార్చుకోవాల్సినవారు ఎవరైనా ఉంటే సమీపంలోని ఆర్బీఐ కార్యాలయాలకు వెళ్లవచ్చని దాస్ సూచించారు. ఈ ఏడాది మే 19న రూ.2వేల నోట్లను చలామణి నుంచి ఉపసంహరిస్తున్నట్టు ఆర్బీఐ ప్రకటించిన విషయం తెలిసిందే. వీటిని బ్యాంకుల్లో మార్చుకోవచ్చని సెప్టెంబర్ 30 వరకు గడువూనూ ఇచ్చిన సంగతి విదితమే. ఈ క్రమంలో మరో వారం రోజులు ఈ సౌకర్యాన్ని పొడిగించగా, శనివారంతో అది పూర్తవుతున్నది. ఇదిలావుంటే రూ.3.43 లక్షల కోట్ల విలువైన రూ.2వేల నోట్లు (87 శాతం) తిరిగొచ్చేశాయని దాస్ తెలిపారు. బ్యాంకుల్లోనే డిపాజిట్ అయ్యాయన్న ఆయన.. ఇంకా రూ.12,000 కోట్లు రావాల్సి ఉందన్నారు.

వచ్చే ఏప్రిల్-జూన్‌లోనే తగ్గొచ్చు

వచ్చే ఏడాది ఏప్రిల్-జూన్‌లోనే వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గించే వీలుందని పలువురు ఆర్థిక నిపుణులు, బ్యాంకింగ్ పరిశ్రమ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఏప్రిల్, జూన్, ఆగస్టు నెలల్లో జరిపిన ద్రవ్యసమీక్షల్లో రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచిన విషయం తెలిసిందే. తాజా ద్రవ్యసమీక్షలోనూ అదే బాటలో రిజర్వ్ బ్యాంక్ నడిచింది. దీంతో వచ్చే రెండు ద్రవ్య సమీక్షల్లోనూ (డిసెంబర్, ఫిబ్రవరి) వడ్డీరేట్ల తగ్గింపు ఉండకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వర్షాభావ పరిస్థితులు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, అంతర్జాతీయంగా ఆహార సరఫరాలో ఇబ్బందులు ద్రవ్యోల్బణాన్ని ఇంకా ఎగదోయవచ్చని, కనుక ఈ ఆర్థిక సంవత్సరం (2023-24) వడ్డీరేట్ల కోత కష్టమేనని క్రిసిల్ అంటున్నది. డ్యూషే బ్యాంక్, నొమురా కూడా ఇదే విధంగా చెప్తున్నాయి.

కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం వృద్ధిదాయక చర్యే. పీఐడీఎఫ్‌లో పీఎం విశ్వకర్మ పథకాన్ని కలిపేయడం మంచి నిర్ణయం. చిన్నతరహా కళాకారులకు ప్రయోజనం చేకూరుతుంది.

-దినేశ్ కుమార్ ఖారా, ఎస్బీఐ చైర్మన్

కీలక వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం వల్ల ఈ పండుగ సీజన్‌లో గృహ విక్రయాలకు ఆర్బీఐ జోష్‌నిచ్చినట్టైంది. ఎంతోమంది మదుపరులు స్థిరాస్తి కొనుగోలుకు ముందుకు రావడానికి వీలు కలిగింది. అయితే వచ్చే ద్రవ్యసమీక్షలోనైనా వడ్డీరేట్లు తగ్గితే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది.

-బొమన్ ఇరానీ, క్రెడాయ్ అధ్యక్షుడు

ఆర్బీఐ నిర్ణయాలు అంచనాలకు తగ్గట్టుగానే ఉన్నాయి. రెపోరేటును యథాతథంగా ఉంచి దేశ ఆర్థిక వ్యవస్థకు, వృద్ధిరేటుకు రిజర్వ్ బ్యాంక్ మద్దతిచ్చింది. స్థిరమైన వడ్డీరేట్లు మార్కెట్‌లో మరింత పోటీ వాతావరణాన్ని సృష్టించగలవు.

-త్రిభువన్ లఢికారి, ఎల్ఐసీ హౌజింగ్ ఫైనాన్స్ సీఈవో

ఆర్బీఐ ద్రవ్యసమీక్ష నిర్ణయాలు ముందుగా ఊహించినట్టుగానే ఉన్నాయి. ద్రవ్యోల్బణం కదలికల్ని నిశితంగా గమనిస్తున్న ఆర్బీఐ వైఖరి సరైనదే. త్వరలోనే ధరలు శాంతించి వృద్ధికి బాటలు పడుతాయని ఆశిస్తున్నాను.

-శుభ్రకాంత్ పాండా, ఫిక్కీ అధ్యక్షుడు

మార్కెట్లకు ఆర్బీఐ కిక్కు

ముంబై, అక్టోబర్ 6: వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ రిజర్వ్ బ్యాంక్ తీసుకున్న నిర్ణయం మార్కెట్లకు ఊపునిచ్చాయి. వడ్డీరేట్లకు సంబంధించిన రంగాలైన ఆర్థిక, రియల్టీ, వాహన రంగ షేర్లు మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరపడంతో ఇంట్రాడేలోనే 66 వేలు దాటిన బీఎస్ఈ సెన్సెక్స్ చివరివరకు ఇదే ట్రెండ్‌ను కొనసాగించింది. ఆసియా, యూరప్ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలు కూడా మదుపరులను కొనుగోళ్ల వైపు మళ్లించాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి బీఎస్ఈ సెన్సెక్స్ 364.06 పాయింట్లు ఎగబాకి 65,995.63 వద్ద ముగియగా..ఎన్ఎస్ఈ నిఫ్టీ 107.75 పాయింట్లు అందుకొని 19,653.50 వద్ద స్థిరపడింది.

బజాజ్ ఫిన్‌సర్వ్ టాప్‌గెయినర్..

ఆర్థిక సేవల సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్ టాప్ గెయినర్‌గా నిలిచింది. వడ్డీరేట్లు యథాతథంగా ఉండటంతో ఆర్థిక సేవల సంస్థల షేర్లు భారీగా లాభపడ్డాయి. దీంతో బజాజ్ ఫిన్‌సర్వ్ షేరు 6 శాతం లాభపడగా..బజాజ్ ఫైనాన్స్ 4 శాతం, టైటాన్ 2.98 శాతం, ఇండస్ఇండ్ బ్యాంక్, ఐటీసీ, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఇన్ఫోసిస్, టెక్ మహీంద్రా, టీసీఎస్, మారుతి షేర్లు లాభాల్లో ముగిశాయి. కానీ, ఇదే సమయంలో హిందుస్థాన్ యునిలీవర్, ఏషియన్ పెయింట్స్, భారతీ ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లు నష్టపోయాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ ఇండెక్స్‌లు లాభాల్లోనే ముగిశాయి. బ్యాంకింగ్, రియల్టీ రంగ షేర్లు దూకుడును ప్రదర్శించాయి. అధిక ద్రవ్యోల్బణం కారణంగా నాలుగోసారి వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడంతో ఈ రంగ షేర్లు మూడు శాతం వరకు లాభపడ్డాయి. కానీ, టెలికం రంగ సూచీలు నష్టపోయాయి. ఈవారంలో సెన్సెక్స్ 167.22 పాయింట్లు, నిఫ్టీ 15.2 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి.

'అధిక ద్రవ్యోల్బణం కారణంగా రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచింది. బాండ్లు క్రాష్ కావడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను ఈక్విటీకే తరలించడం, అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు తగ్గుముఖం పట్టడం కూడా కలిసొచ్చింది.

- వినోద్ నాయర్, జియోజిట్ ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్

టాటా మోటార్స్ గ్లోబల్ అమ్మకాలు 3.42 లక్షల యూనిట్లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ద్వితీయ త్రైమాసికంలో తమ గ్లోబల్ హోల్‌సేల్ అమ్మకాలు 7 శాతం వృద్ధితో 3.42 లక్షల యూనిట్లకు పెరిగినట్టు టాటా మోటార్స్ ప్రకటించింది. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో టాటా మోటార్స్ వాణిజ్య వాహనాలు, టాటా దేవూ వాహనాల గ్లోబల్ హోల్‌సేల్ అమ్మకాలు 3 శాతం పెరిగి 1,06,620 యూనిట్లకు పెరిగినట్టు కంపెనీ ప్రకటన తెలిపింది. అయితే ఎలక్ట్రిక్ వాహనాలతో సహా పాసింజర్ వాహనాల గ్లోబల్ అమ్మకాలు 3 శాతం తగ్గి, 1,38,939 యూనిట్ల వద్ద నిలిచాయి. జాగ్వర్, ల్యాండ్‌రోవర్ గ్లోబల్ హోల్‌సేల్స్ 29 శాతం వృద్ధి చెంది 96,917 యూనిట్లకు చేరాయి. ఈ త్రైమాసికంలో 13,560 జాగ్వర్ వాహనాలు, 83,257 ల్యాండ్ రోవర్ వాహనాల్ని విక్రయించినట్టు టాటా మోటార్స్ తెలిపింది.



జోరుగా వంటనూనె దిగుమతులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: దేశీయ వంటనూనెల దిగుమతులు ఈ ఏడాది ఆగస్టులో 33 శాతం ఎగిశాయి. ఏకంగా 18.52 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. నిరుడు ఆగస్టు నుంచి ఈ స్థాయిలో నెలవారీ దిగుమతులు లేకపోవడం గమనార్హం. ఇక ఆహారేతర విజిటబుల్ ఆయిల్స్‌తో కలిపి చూస్తే ఈ ఆగస్టు దిగుమతులు 18.66 లక్షల టన్నులుగా ఉన్నాయి. అయితే దేశీయ మార్కెట్‌లో వంటనూనెల ధరలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో డిమాండ్ ఒక్కసారిగా పెరిగిపోయిందని, దిగుమతి సుంకాలు కూడా తక్కువ య్యాయని, దీంతో ఆయా దేశాల నుంచి భారత్‌కు దిగుమతులు పెరిగిపోయాయని సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ (ఎస్ఈఏ) తెలిపింది. కాగా, ఈసారి ఆగస్టు దిగుమతుల్లో పామాయిల్ వాటానే 11.28 లక్షల టన్నులుగా ఉన్నది. రకరకాల విత్తనాలు, పండ్లు, గింజల నుంచి తీసే నూనెలనే వెజిటబుల్ ఆయిల్స్ అంటున్నది తెలిసిందే.

దేశంలో అతిపెద్ద లెమన్ ట్రీ హోటల్

ముంబై, అక్టోబర్ 6: దేశంలో అతిపెద్ద హోటల్ ముంబైలో అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ ఆతిథ్య సేవల సంస్థ లెమన్ హోటల్..ఆర్థిక రాజధానిలో 669 గదులతో నిర్మించిన ఔరిక ముంబై స్కైసిటీని శుక్రవారం ప్రారంభించింది. దేశవ్యాప్తంగా ఉన్న హోటళ్లలో ఇదే అతిపెద్దది కావడం విశేషం. అలాగే ఔరిక హోటల్స్ అండ్ రిసార్ట్ నిర్వహిస్తున్న మూడో హోటల్ ఇది. ముంబైని సందర్శించే వారు రోజు రోజు పెరుగుతున్నారని, వీరికి హోటల్ గదులు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వీరిని దృష్టిలో పెట్టుకొని ఈ అతిపెద్ద హోటల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు లెమన్ ట్రీ హోటల్స్ సీఎండీ పతంజలి జీ కేశ్వానీ తెలిపారు. వచ్చే ఐదేండ్లకాలంలో మొత్తం గదుల సంఖ్యని 20 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ఈ స్టార్ హోటల్ ముంబై ఎయిర్‌పోర్ట్స్ టర్మినల్ 2కు దగ్గరలో ఉన్నది.

కల్యాణ్ జ్యువెల్లర్స్ మరో 33 షోరూంలు

ముంబై, అక్టోబర్ 6: ప్రముఖ ఆభరణాల విక్రయ సంస్థ కల్యాణ్ జ్యువెల్లర్స్..వచ్చే దీపావళి నాటికి మరో 33 షోరూంలను ఏర్పాటు చేయబోతున్నట్టు ప్రకటించింది. దీంతో ఈ ఏడాది చివరినాటికి దేశీయ అవుట్‌లెట్ల సంఖ్య 51కి చేరుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. దక్షిణభారతంలో ఇప్పటికే పాగావేసిన సంస్థ..ఉత్తర భారతంలో దృష్టి సారించడంలో భాగంగా ఇటీవల కాలంలో ఇక్కడ 20 నూతన షోరూంలను ప్రారంభించినట్టు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది.

5 నెలల కనిష్ఠానికి ఫారెక్స్ నిల్వలు

ముంబై, అక్టోబర్ 6: దేశం వద్దనున్న విదేశీ మారక నిల్వలు (ఫారెక్స్) వరుసగా నాలుగో వారమూ తగ్గి ఐదు నెలల కనిష్ఠానికి పడిపోయాయి.. సెప్టెంబర్ 29తో ముగిసిన వారంలో ఇవి భారీగా 3.8 బిలియన్ డాలర్ల మేర తగ్గి 586.91 బిలియన్ డాలర్ల స్థాయికి క్షీణించినట్టు రిజర్వ్‌బ్యాంక్ శుక్రవారం తెలిపింది. అంతక్రితం వరుస మూడు వారాల్లో ఇవి 8.2 బిలియన్ డాలర్ల మేర తగ్గాయి. రూపాయి పతనాన్ని నిరోధించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఫారెక్స్ స్పాట్, ఫార్వర్డ్ మార్కెట్లలో డాలర్లను విక్రయించడంతో నిల్వల్లో తరుగుదల ఏర్పడిందని ట్రేడర్లు తెలిపారు. 2021 అక్టోబర్‌లో 645 బిలియన్ డాలర్ల రికార్డుస్థాయికి చేరిన తర్వాత మళ్లీ ఆ స్థాయికి నిల్వలు కోలుకోలేదు. సెప్టెంబర్ 29తో ముగిసిన వారంలో విదేశీ నిల్వల్లో అధికభాగమైన విదేశీ కరెన్సీ ఆస్తులు ఏకంగా 3.13 బిలియన్ డాలర్లు తగ్గి 520.24 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్ మారకంలో వెల్లడించే విదేశీ కరెన్సీ ఆస్తుల్లో..అమెరికాయేతర కరెన్సీలయిన యూరో, పౌండ్, యెన్‌ల విలువల్లో ఏర్పడిన పెరుగుదల లేదా తరుగుదలను పరిగణనలోకి తీసుకుంటారు.

బంగారం నిల్వల్లోనూ తరుగు

సమీక్షా వారంలో రిజర్వ్‌బ్యాంక్ వద్దనున్న బంగారం నిల్వలు సైతం తరిగిపోయాయి. ఇవి 576 మిలియన్ డాలర్ల మేర క్షీణించి 43.73 బిలియన్ డాలర్లకు తగ్గినట్టు ఆర్బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ (ఎస్‌డీఆర్‌లు) 74 మిలియన్ డాలర్లు తగ్గుదలతో 17.94 బిలియన్ డాలర్లకు చేరాయి. ఐఎంఎఫ్ వద్ద ఉంచిన రిజర్వుల విలువ 18 మిలియన్ డాలర్లు తగ్గి 5 బిలియన్ డాలర్ల వద్ద నిలిచాయి.

వరుసగా నాలుగో వారంలోనూ క్షీణత



బుల్లెట్ గోల్డ్ లోన్స్ పరిమితి రూ.4 లక్షలు

పట్టణ సహకార బ్యాంక్‌లకు ఆర్బీఐ చాన్స్

న్యూఢిల్లీ, అక్టోబర్ 6: బుల్లెట్ రీపేమెంట్ స్కీమ్ కింద పట్టణ సహకార బ్యాంక్‌లు బంగారంపై ఇచ్చే రుణాల పరిమితిని రిజర్వ్ బ్యాంక్ రెట్టింపు చేసింది. గతంలో ఈ పరిమితి రూ.2 లక్షలు ఉండగా, ఇప్పుడు రూ.4 లక్షల వరకూ పెంచింది. అయితే 2023 మార్చి 31నాటికి ప్రాధాన్యత రంగ రుణాల లక్ష్యాలను (పీఎస్ఎల్) పూర్తిచేసిన సహకారం బ్యాంక్‌లకే ఈ పెంపు సదుపాయం వర్తిస్తుందని ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ చెప్పారు. ఇటీవల పట్టణ సహకార బ్యాంక్‌ల చీఫ్‌లతో సమావేశమైన దాస్..పీఎస్ఎల్ లక్ష్యాల్ని పూర్తిచేసిన బ్యాంక్‌లకు 'తగిన ప్రోత్సాహకాలు' ప్రకటిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజా రుణ వితరణ అవకాశాన్ని కల్పించారు. ఈ అవకాశాన్ని పొందిన బ్యాంక్‌లు పీఎస్ఎల్ లక్ష్యాలు, ఉపలక్ష్యాల సాధనను కొనసాగించాల్సి ఉంటుందని, ఈ అంశంపై సవివరమైన మార్గదర్శకాలను ప్రత్యేకంగా జారీచేయనున్నట్టు ఆర్బీఐ తెలిపింది.

బుల్లెట్ గోల్డ్ లోన్ అంటే..

బంగారంపై తీసుకున్న రుణం కాలపరిమితి ముగిసినపుడే పూర్తిగా అసలు, వడ్డీ మొత్తాన్ని ఒకేదఫా చెల్లించే వీలును కల్పించేదే బుల్లెట్ రీపేమెంట్ ఆప్షన్. ఈఎంఐ షెడ్యూల్ పాటించడం, పాక్షిక చెల్లింపులు చేయడం వంటి ఆందోళనలు బంగారం రుణాలు తీసుకున్నవారికి ఉండవు. ఈ రుణంపై వడ్డీ రేటును ప్రతీ నెలా లెక్కిస్తారు. కానీ కాలపరిమితి ముగిసిన తర్వాత అసలు, వడ్డీ కలిపి చెల్లిస్తే చాలు. బుల్లెట్ రీపేమెంట్ పూర్తిచేసినవారు తనఖా చేసిన బంగారాన్ని వెనక్కు తీసుకోవచ్చు లేదా రోలోవర్ చేసుకోవచ్చు. ఇప్పటివరకూ ఈ రుణాల గరిష్ఠ కాలపరిమితి 12 నెలలు. రోలోవర్ చేసుకుంటే చెల్లించిన మరుసటి రోజే కొత్త రుణాన్ని తీసుకోవచ్చు.

వ్యక్తిగత రుణాలతో జాగ్రత్త

- **బ్యాంక్‌లను హెచ్చరించిన దాస్**

ముంబై, అక్టోబర్ 6: బ్యాంకింగ్ వ్యవస్థలో రిటైల్ అన్‌సెక్యూర్డ్ లోన్స్ (వ్యక్తిగత రుణాలు) శరవేగంగా పెరుగుతున్న నేపథ్యంలో వీటి ద్వారా ఆర్థిక స్థిరత్వం రిస్క్‌లో పడుతుందన్న ఆందోళనను ఆర్బీఐ వ్యక్తం చేసింది. పరపతి విధాన ప్రకటన సందర్భంగా గవర్నర్ దాస్ మాట్లాడుతూ పర్సనల్ లోన్స్‌తో ప్రస్తుతానికి ఎటువంటి సమస్యా లేదని, భవిష్యత్ రిస్క్‌ల పట్ల బ్యాంకర్లు జాగురూకతతో వ్యవహరించాలనే లక్ష్యంతోనే తాము హెచ్చరిస్తున్నామన్నారు. 'మీరు జాగ్రత్తగా ఉండాలంటూ వారిని (రుణదాతలు) మేము కేవలం అప్రమత్తం చేస్తున్నాం. మీ కళ్లు, చెవులు తెరిచి ఉంచడమే కాదు. ముక్కు కూడా తెరవాలి. సంక్షోభం ఎక్కడ్నుంచి వస్తుందో వాసన పసిగట్టేందుకు' అని దాస్ సూచించారు. ఏదైనా బ్యాంక్‌లో సమస్య ఏర్పడితే ఆర్బీఐ సూపర్‌వైజర్లు నేరుగా అటువంటి ఆర్థిక సంస్థను పర్యవేక్షిస్తారన్నారు. ప్రస్తుతానికి బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు స్థిరంగా ఉన్నాయని, జూన్ త్రైమాసికంలో స్థూల ఎన్‌పీఏల నిష్పత్తి మెరుగుపడిందన్నారు.

డిజిటలైజేషన్‌తో భారీ రిటైల్ రుణ వృద్ధి

డిజిటల్ సాధనాల ద్వారా రుణాలివ్వడమే పలు బ్యాంక్‌ల అన్‌సెక్యూర్డ్ రుణాలు విపరీతంగా పెరగడానికి కారణమని ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ చెప్పారు. గవర్నర్ దాస్ వ్యాఖ్యలు కేవలం సూచనలు మాత్రమేనని, ఆర్బీఐ ప్రస్తుతానికి ఎటువంటి స్థూల నియంత్రణా చర్యలేవీ ప్రకటించడం లేదన్నారు. తొలి రక్షణగా బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, ఫిన్‌టెక్‌లు తగినరీతిలో అంతర్గత నియంత్రణలు చేపట్టాని స్వామినాథన్ సూచించారు. క్రెడిట్ కార్డులు, వ్యక్తిగత రుణాలు వంటి అన్‌సెక్యూర్డ్ లోన్స్ బాగా పెరిగిపోతున్నాయని, గత రెండేండ్లలో మొత్తం రుణ వృద్ధి 12-14 శాతం ఉండగా, అన్‌సెక్యూర్డ్ రుణాలు 23 శాతం వృద్ధిచెందాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో తదుపరి విచారించేకంటే ముందుగానే అంతర్గత పర్యవేక్షణా యంత్రాంగాన్ని పటిష్ఠపర్చుకోవాలని ఆర్థిక సంస్థలకు సూచించారు.

పీట్రాన్ హైదరాబాద్ ప్లాంట్ విస్తరణ

హైదరాబాద్, అక్టోబర్ 6: ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ సంస్థ పీట్రాన్..హైదరాబాద్‌లో ఉన్న ప్లాంట్‌ను విస్తరిస్తున్నది. ప్రస్తుతం నాచారం వద్ద 35 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన అసెంబ్లింగ్ యూనిట్‌ను 80 వేల చదరపు అడుగుల విస్తీర్ణానికి పెంచుతున్నట్లు కంపెనీ ఫౌండర్, సీ